క్లుప్తంగా

వీరాంజనేయస్వామికి తమలపాకుల సేవ


తమలపాకులతో అభిషేకం చేస్తున్న అర్చకుడు

రాజాం: పట్టణంలోని గాయత్రీకాలనీ రోడ్డులో ఉన్న వీరాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. 5001 తమలపాకులతో అభిషేకం చేశారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ చేపట్టారు.

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు


రేగిడి ఆమదాలవలసలో సుబ్రహ్మణ్య స్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రేగిడి: మండలంలోని ఆమదాలవలస, రేగిడి, గోపెంపేట, అంబకండి, సంకిలి, తదితర గ్రామాల్లో వెలసిన సుబ్రహ్మణ్య స్వామి ఆలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమదాలవలస ఆలయంలో పూజారి కిన్నెరకాంతం అన్నారావు ఆధ్వర్యంలో భక్తులు విశేష పూజలు చేపట్టారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


లింగాలవలస సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కాశీవిశ్వనాథరావు

రేగిడి: గ్రామాల్లో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేయాలని ఎంపీడీఓ జి. కాశీవిశ్వనాథరావు అన్నారు. మండలంలోని లింగాలవలస, నాయరాలవలస, తదితర గ్రామ సచివాలయాలను మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది విధులపై ఆరా తీసి, పలు సూచనలు చేశారు.

జోరుగా ఉపాధి పనులు


చిన్నశిర్లాంలో తోటపల్లి కాలువలో పనులు చేస్తున్న వేతనదారులు

రేగిడి: మండలంలోని తోటపల్లి, మద్దువలస పిల్ల కాలువల్లో మంగళవారం ఉపాధి పనులు చేపట్టారు. ఖరీఫ్ సమయానికి పంటపొలాలకు సాగునీటిని అందించేందుకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఈ పనులు చేపడుతున్నామని ఏపీఓ హరనాథరావు తెలిపారు. చిన్నశిర్లాం సమీపంలోని తోటపల్లి సాగునీటి కాలువలో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. రైతులకు ఉపయోగపడే విధంగా ఉండేలా పనులు చేయిస్తున్నామని తెలిపారు.

పనుల పరిశీలన


గరికిపాడు సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ రఘునాథాచారి

సంతకవిటి: మండలంలోని గరికిపాడులో చెత్త నుంచి సంపద సేకరణ షెడ్ నిర్మాణ పనులను ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. అనంతరం గ్రామ సచివాలయంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్ల హాజరును పరిశీలించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారున. కార్యక్రమంలో ఏపీఓ త్రినాథ్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు


రికార్డులు పరిశీలిస్తున్న సీఐ ఉపేంద్రరావు

వంగర: గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని సీఐ హెచ్. ఉపేంద్రరావు అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా నమోదైన కేసులు, సమస్యాత్మక ప్రాంతాలపై ఆరా తీశారు. ప్రజలు స్నేహభావంతో మెలగాలని, ఎటువంటి వివాదాలు, తగాదాలకు పాల్పడొద్దన్నారు. కార్యక్రమంలో ఎస్సై ఆర్.జనార్ధనరావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

జనం కోసమే జగనన్న

● డిప్యూటీ సీఎం రాజన్నదొర


లబ్ధిదారులకు పథకాలను వివరిస్తున్న డిప్యూటి సీఎం రాజన్నదొర

మెంటాడ: జనం కోసమే నిరంతరం జగనన్న ప్రభుత్వం పని చేస్తుందని ఉప ముఖ్యమంత్రి,, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని కేఎల్‌వలస సచివాలయం పరిధిలో రెడ్డివానివలస, గజంగుడ్డివలస, పసుపువానివలస, చల్లవానివలస, మామిడివలస, తోటవలస, గజరాయునివలస, పాడివానివలస, సీలవలస, పుల్లేటివలస, కొండమామిడివలస, తాటిపూడివలస గ్రామాలలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజనులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి ఆయన గిరిజనులకు ప్రభుత్వం నుండి అందుతున్న పథకాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న నవరత్నాలకు సంభందించిన బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకూ గడప గడపకు ఎలాంటి ఆదరణ లభిస్తుందో అంతకు మించి జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి కూడా ప్రజల నుండి మంచి ఆదరణ లభిసుదన్నారు. ప్రజలే నేరుగా ముఖ్యమంత్రికి ఫోన్ చేసి నేరుగా మాట్లాడి తమ సమస్యలకు పరిష్కార మార్గం చూసుకోవడం దేశంలో ఏ రాష్ట్రంలో లేదన్నారు. అహర్నిశలు ప్రజలు మంచి కోసమే పని చేస్తున్న జగనన్నకు ప్రతీ అవ్వా, అమ్మా, అక్కా, చెల్లి తన ఇంటి బిడ్డ వలే చూసుకుని మురిసిపోతున్నారన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు అన్ని వర్గాల ప్రజలకు పారదర్శకంగా అందుతున్నాయన్నారు. జనం కోసమే జగనన్న ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ సందర్భంగా ప్రజలు చెప్పిన సమస్యలను ఉప ముఖ్యమంత్రి రాజన్నదొరే స్వయంగా నోట్ చేసుకున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా విభాగం నాయకురాలు సిరిపురం నాగమణి, సర్పంచ్ పాడి వరాలమ్మ, ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, గృహ సారథులు, కన్వీనర్ కలనిమెరక త్రినాద్, వైస్ ఎంపీపీ సారిక ఈశ్వరరావు, మండల నాయకులు మయూర్ అప్పలనాయుడు, లెంక రత్నాకర్ నాయుడు, రాయిపిల్లి రామారావు, హనుమంత రాజు, బాయి అప్పారావు, కిలపర్తి మధు, మోహన్, ఎంపీడీఓ తివిక్రమ్‌తో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో 'స్పందన' సమస్యల పరిష్కారం


మాట్లాడుతున్న ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ

తెర్లాం: స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులను సకాలంలో పంచాయతీ కార్యదర్శులంతా పరిష్కరించాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ సూచించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులపై చర్యలు తీసుకొనేందుకు వెనుకాడేది లేదన్నారు. మండల పరిషత్ సమావేశ భవనంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం ఈఓపీఆర్‌డీ రాంబాబు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న ఎంపీడీఓ మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శుల లాగిన్‌లోకి వచ్చిన స్పందన సమస్యలను ఎప్పటికప్పుడు చూసి, వాటిని సకాలంలో పరిష్కరించాలని తెలిపారు. మండలంలోని 21 గ్రామ సచివాలయాల్లో చాలా సచివాలయాల్లో స్పందన సమస్యలు చూడడం లేదని చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు ప్రతీరోజూ స్పందన లాగిన్‌ను పరిశీలించి, అందులో ఏవైనా సమస్యలు నమోదైతే వెంటనే వాటిని పరిష్కరించాలని సూచించారు. ఈఓపీఆర్‌డీ రాంబాబు మాట్లాడుతూ గ్రామాల్లో చెత్తశుద్ధి కేంద్రాల నిర్వహణ సక్రమంగా చేపట్టాలన్నారు. వర్మీ కంపోస్ట్ తయారు చేయించి పంచాయతీకి అదనపు ఆదాయం చేకూరేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో ఎంపీడీఓ కార్యాలయ ఏఓ డీవీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వేతనం గిట్టుబాటు అయ్యేలా పనులు

తెర్లాం: మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న వేతనదారుల రోజువారీ వేతనం గిట్టుబాటు అయ్యేలా పనులు చేయించాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, ఉపాధి ఏపీఓ జగదీశ్వరరావు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఉపాధి హామీ పథకంపై సమీక్షించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనుల వివరాలు, వేతనదారుల హాజరు, వేతనదారులకు రోజువారీ వేతనం ఎంత గిట్టుబాటు అవుతున్నదీ సంబంధిత అధికారులను ఎంపీడీఓ అడిగి తెలుసుకున్నారు. ఉపాధి పనులకు హాజరైన వేతనదారుల మస్టర్లు ఎన్ఐసీలో నమోదు చేయాలని, పని ప్రదేశం నుంచి పనులు చేస్తున్నట్లు క్షేత్ర సహాయకులు ఫోటోలు అప్‌లోడ్ చేయాలని తెలిపారు. వేతనదారులకు రోజువారీ వేతనం రూ.257లు వచ్చేలా వారితో పనులు చేయించాలన్నారు. పని ప్రదేశంలో తప్పనిసరిగా టెంట్లు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

వేగవంతంగా అభివృద్ధి పనులు


ఇంజనీరింగ్ సహాయకులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

రామభద్రపురం: మండలంలోని చేపట్టిన అభివృద్ధి పనులను పరుగులెత్తించాలని ఎంపీడీఓ రమామణి అన్నారు. ఎంపీడీఓ సమావేశపు కార్యాలయంలో హౌసింగ్ డీఈఈ రత్నకుమార్, పంచాయతీరాజ్ ఏఈ రమేష్‌తో కలిసి మంగళవారం ఆమె సచివాలయ ఇంజనీరింగ్ సహాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో చేపడుతున్న సీసీ రోడ్లు, డ్రైనేజీలు, సచివాలయం, ఆర్బీకేలు, వెల్‌నెస్ సెంటర్లు వంటి కార్యాలయాలతో పాటు నాడు నేడు కింద చేస్తున్న పాఠశాలల ఆధునీకరణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. నిర్మాణ పనుల్లో మెటీరియల్ వినియోగంలో రాజీ పడకూడదన్నారు. ఏదీ ఏమైనా ఈ నెలాఖరులోపు అన్ని అభివృద్ధి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ తిరుమలప్రసాద్, హౌసింగ్ ఏఈ వై.సత్యారావునాయుడు తదితరులు పాల్గొన్నారు.

చెత్తశుద్ధి కేంద్రాన్ని సక్రమంగా వినియోగించాలి


ఆమిటి చెత్తశుద్ధి నిర్వహణ కేంద్రాన్ని శుభ్రం చేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి

తెర్లాం: మండలంలోని ఆమిటి గ్రామంలోని చెత్తశుద్ధి నిర్వహణ కేంద్రాన్ని సక్రమంగా నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శి చింతల సత్యనారాయణ గ్రీన్ అంబాసిడర్లకు తెలియజేశారు. గ్రామంలోని చెత్తశుద్ధి నిర్వహణ కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గ్రీన్ అంబాసిడర్లతో మాట్లాడుతూ గ్రామాల్లోని అన్ని వీధుల్లోకి వెళ్లి సేకరించిన చెత్తను చెత్తశుద్ధి కేంద్రం వద్ద ఉన్న ఫిట్‌లలో వేయాలన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేయాలన్నారు. పంచాయతీకి ఆదాయం వచ్చేలా వర్మీ కంపోస్ట్ తయారు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. చెత్తశుద్ధి కేంద్రం వద్ద ఉన్న పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాలను ఆయన గ్రీన్ అంబాసిడర్లతో శుభ్రం చేయించారు.

వలంటీర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

రాజాం సిటీ: మండల న్యాయ సేవాధికార సంఘం ఆధ్వర్యంలో పారా లీగల్ వలంటీర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు (పదవీ విరమణ పొందిన వారితో సహా), పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, వయోవృద్ధులు, ఎంఎస్‌డబ్ల్యూ విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యులు, విద్యార్థులు, రాజకీయేతర సభ్యులు, సేవా దృక్పథం కలిగిన ప్రభుత్వేతర సంఘ సభ్యులు, మైత్రి సంఘ సభ్యులు, ఇతర స్వయం సహాయక సంఘ సభ్యులు అర్హులని పేర్కొన్నారు. పదో తరగతి అర్హత కలిగి రాజాం, రేగిడి, సంతకవిటి మండలాల పరిధిలో నివాసితులై ఉండాలని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, విద్యార్హత ధ్రువపత్రాలతో కూడిన దరఖాస్తును ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు మండల న్యాయ సేవాధికార సంఘ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. పారాలీగల్ వలంటీర్‌గా నియమితులైన వారికి ఎటువంటి పారితోషికం గాని వేతనం గాని ఉండవన్నారు.

ఘనంగా దాడితల్లి మారు వారాలు


దాడితల్లి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

బొబ్బిలి: ఉత్తరాంధ్ర కల్పవల్లి శ్రీ గొల్లపల్లి దాడితల్లి అమ్మవారి మారు వారాలు మంగళవారం ఘనంగా జరిగాయి. స్థానిక బైపాస్ రహదారి వద్ద గల ఆలయంలో ఉదయం నుంచే భక్తులు పోటెత్తారు. అర్చకులు పిండిప్రోలు మణికుమార్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వ్యక్తిపై ఫిర్యాదు

రాజాం సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కుటుంబపై అసభ్యకర పోస్టులు పెడుతున్న వ్యక్తిపై వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రేగిడి మండలం సరసనాపల్లికి చెందిన పంతల హరిబాబు ముఖ్యమంత్రి, ఆయన కుటుంబ సభ్యుల ఫొటోలను మార్ఫింగ్ చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్లు అగిరెడు వీరాస్వామి, బట్న వంశీ, మజ్జి శ్రీను, బెండు వెంకటరావు, యండమూరి వాసు, కొమరపురి వెంకటేష్ ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాజాం సిటీ: ఈ ఏడాది పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఐటీఐలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రాజాం ఐటీఐ ప్రిన్సిపాల్ డి. శ్రీనివాసాచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 – 24 ఏడాదికిగాను వివిధ ట్రేడ్‌ల్లోని ఖాళీల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరుతున్నామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఐటీఐ.ఏపీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో జూన్ 6 సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుతో పాటు పదో తరగతి సర్టిఫికెట్, కులధ్రువీకరణ పత్రం, టీసీ, స్టడీ సర్టిఫికెట్, ఆధార్ నంబర్, ఫోన్ నంబర్, ఈ మెయిల్ అడ్రస్, పాస్‌పోర్టు సైజు ఫొటో జత చేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు దగ్గర్లోని ఐటీఐలను సంప్రదించాలని తెలిపారు.

అంధత్వ నివారణే ప్రభుత్వ లక్ష్యం


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి మూర్తి

రామభద్రపురం: అంధత్వ నివారణే ప్రభుత్వ లక్ష్యంగా వైఎస్సార్ కంటి వెలుగు కార్యమం అమలు చేసి ప్రజలందరికీ ఉచితంగా కంటి వైద్య సేవలందిస్తోందని కంటి వైద్యాధికారి ఎల్ఎల్ఎస్ మూర్తి అన్నారు. మండల కేంద్రంలోని సచివాలయం పరిధిలో గల చొక్కాపు వీధి ప్రాథమిక పాఠశాలలో వైఎస్సార్ కంటివెలుగు కార్యమంలో భాగంగా రోగులకు ఉచిత కంటి పరీక్షలు చేశారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య


మండాకురిటిలో అవగాహన కల్పిస్తున్న సర్పంచ్, తదితరులు

సంతకవిటి: ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య లభిస్తోందని మండాకురిటి సర్పంచ్ బత్తుల జ్యోతీశ్వరరావు అన్నారు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులతో కలిసి మంగళవారం ఆయన గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'నాడు–నేడు' ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించినట్లు చెప్పారు. అలాగే పుస్తకాల నుంచి జగనన్న కిట్ల వరకు అన్నీ ఉచితంగా అందజేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండాకురిటి జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం వీవీఎస్ ఉమాశంకర్, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం బూరాడ సన్యాసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

రాజాం: మండలంలోని పెనుబాకలో చెరువు, సాగునీటి కాలువల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ బాసూరి శంకరరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేతనదారులు ఎండ బారిన పడకుండా పనులు చేసుకోవాలన్నారు. రెండు పూటలా పనులు చేయడం వల్ల వేతనం గిట్టుబాటు అవుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీఓ సాయిరాం, జేఈ నరేంద్ర, టీఏ ఆనందరావు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్‌లు పాల్గొన్నారు.

సరిగా పని చేయకుంటే తొలగించండి

● మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణారావు


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు

బొబ్బిలి: రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రజలకు పనికి రాని వలంటీర్లను తక్షణమే తొలగించాలని మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు అన్నారు. మంగళవారం తన చాంబర్‌లో 4, 29 వార్డుల సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విధుల పట్ల నిర్లక్ష్యం వహించే ఎవరినీ ఉపేక్షించేది లేదన్నారు. ప్రజల వినతులను ఇక నుంచి జగనన్నకు చెబుదాంలో త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ మేనేజర్ బీఎండీ ప్రసాదరావు, జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జి రేజేటి ఈశ్వరరావు(విసు), 4వ వార్డు ఇన్‌చార్జి అమర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డెంగీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి


రేగిడి: ర్యాలీ చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది


రాజాం : బొద్దాంలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

రేగిడి: ప్రజలు డెంగీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ అసిరినాయుడు అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినం సందర్భంగా మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనారోగ్యం సోకిన వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది అప్పారావు, రమణ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బొద్దాంలో..

రాజాం: మండలంలోని బొద్దాంలో జాతీయ డెంగీ నివారణ దినం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డెంగీ సోకుండా తీసుకోవాల్సిన నివారణ చర్యలపై డాక్టర్లు బి. నరేంద్ర, ఎం. సిద్ధీశ్వరి సూచించారు. వాడి వదిలేసిన టైర్లు, ట్యూబ్‌లు, ఖాళీ కొబ్బరిబొండాల్లో నిల్వ ఉన్న నీటిలో డెంగీ దోమ ఉంటుందని తెలిపారు. ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఈశ్వరరావు, శశికిరణ్‌కుమారి, పెంటమ్మలతో పాటు ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్షణ చర్యలు చేపట్టాలి

● లేబర్ ఆఫీసర్ కొండలరావు


రాజాంలో ఓ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న లేబర్ ఆఫీసర్ కొండలరావు

రాజాం: కార్మికులు వడగాడ్పుల బారిన పడకుండా యాజమాన్యాలు రక్షణ చర్యలు చేపట్టాలని లేబర్ ఆఫీసర్ బి. కొండలరావు సూచించారు. పట్టణంలోని పలు షాపులు, వ్యాపార సంస్థలు, ఫ్యాక్టరీలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వేసవి ఎద్దడి నుంచి ఉపశమనం కల్పించేందుకు అందుబాటులో ఉంచిన వస్తువులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాజాం పట్టణంతో పాటు నియోజకవర్గంలో అన్ని మండలాల్లోని భవన నిర్మాణ, ఇతర నిర్మాణ సంస్థల యజమానులు, పరిశ్రమల యజమానులు, వ్యాపార, వర్తక వాణిజ్య సంస్థల ప్రతినిధులు వేసవి వడగాడ్పుల విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ నుంచి కార్మిక కమిషన్‌కు సూచనలు రావడంతో ఆదేశాలు జారీ చేస్తున్నట్లు వెల్లడించారు. కార్మికులకు అందుబాటులో తాగునీరు ఉంచాలన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 వరకు విరామం ఇవ్వాలని స్పష్టం చేశారు. షాపులు, ఫ్యాక్టరీలు, భవన నిర్మాణ సంస్థల వద్ద అందుబాటులో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఐవీ ఫ్లూయిడ్స్ ఉంచాలని తెలిపారు. ఎవరైనా వడదెబ్బకు గురైతే 108 వాహనానికి సమాచారం ఇవ్వాలని సూచించారు.

అన్ని గ్రామాల్లోనూ బోర్లకు మరమ్మతులు


ఎంపీపీ లావేటి సులోచన

రాజాం: మండలంలో వేసవి నేపథ్యంలో అన్ని గ్రామాల్లోనూ తాగునీటి బోర్లకు మరమ్మతులు చేపడుతున్నట్లు ఎంపీపీ లావేటి సులోచన తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, అన్ని గ్రామ పంచాయతీలకు మెటీరియల్ పంపిణీ చేశామని, మెకానిక్‌లతో యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. క్రాస్‌ప్రోగ్రాం ద్వారా మండలంలో నాలుగు లక్షల రూపాయల వరకు ఖర్చు చేసినట్లు చెప్పారు.

వివాదాలకు పాల్పడవద్దు

● డీఎస్పీ ఏఎస్ చక్రవర్తి


మాట్లాడుతున్న డీఎస్పీ చక్రవర్తి

వంగర: ఉపాధిహామీ వేతనదారులు ఎటువంటి వివాదాలకు పాల్పడొద్దని బొబ్బిలి డీఎస్పీ ఏఎస్ చక్రవర్తి తెలిపారు. శ్రీహరిపురం బౌండరీలో ఉన్న బుగత చెరువులో శ్రీహరిపురం ఆర్‌అండ్‌ఆర్ కాలనీ వేతనదారులు పనులు చేయడాన్ని శ్రీహరిపురం గ్రామస్తులు అడ్డుకోవడంతో స్వల్ప వివాదం నెలకొంది. ఈ విషయమై రెండు గ్రామాలకు చెందిన నాయకులతో మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డీఎస్పీ మాట్లాడారు. ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు సమక్షంలో ఇరు గ్రామాల్లో వేతనదారులు సమస్యను సానుకూలంగా పరిష్కరించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్రరావు, ఎస్సై ఆర్.జనార్ధనరావు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి


మాట్లాడుతున్న ఎంఈఓ దుర్గారావు

వంగర: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లు నిండిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ వై.దుర్గారావు తెలిపారు. మంగళవారం స్థానిక ప్రాథమిక పాఠశాలలో జరిగిన అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందని, ఈ విషయంలో చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఐసీడీఎస్ రాజాం సెక్టార్ పీఓ కనకదుర్గ మాట్లాడుతూ, అంగన్‌వాడీ కార్యకర్తలు విధులు, బాధ్యతలపై వివరించారు. కార్యక్రమంలో సీడీపీఓ పూర్ణిమ, ఏసీడీపీఓ సిమ్మాలమ్మ, తదితరులున్నారు.

చురుగ్గా బోర్ల మరమ్మతులు

తెర్లాం: మండలంలో క్రాష్ కార్యక్రమం ద్వారా పలు గ్రామాల్లో బోరుబావుల మరమ్మతు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. మండలంలోని కూనాయవలస గ్రామంలో సర్పంచ్ బోడెల విజయబాబు ఆధ్వర్యంలో మరమ్మతులకు గురైన బోర్లను మంగళవారం బాగు చేశామని బోర్ మెకానిక్ బోడెల కృష్ణ తెలిపారు. మండలంలో పనిచేస్తున్న బోరు మెకానిక్‌లు షెడ్యూల్ ప్రకారం గ్రామాలకు వెళ్లి బోరుబావులను పరిశీలించి, ఏదైనా బోరుబావి మరమ్మతుకు గురైతే వెంటనే బాగు చేస్తున్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు


మాట్లాడుతున్న ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ

వంగర: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీహెచ్‌సీ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 104 వాహనాలతో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. విలేజ్ హెల్త్‌క్లినిక్‌లు, ఆరోగ్య ఉపకేంద్రాల సిబ్బంది పనితీరు మెరుగుపరుచుకోవాలన్నారు. ఎన్‌డీజీ, ఎన్‌సీడీ సర్వే వేగవంతం చేయాలని, ఫ్యామిలీ డాక్టర్ సేవలు ప్రతీ ఇంటికీ చేరాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు, వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.